2024 న్యూ.. జోష్





నరసరావుపేటలో కేక్‌లు కొనుగోలు చేస్తున్న ప్రజలు

- యువత సందడే.. సందడి
- నూతన సంవత్సరానికి ఘన స్వాగతం
- చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు.. ఆలయాల్లో పూజలు

నరసరావుపేట, డిసెంబరు 31: పాత సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ.. నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ జిల్లాలో ఆదివారం అర్ధరాత్రి న్యూ జోష్ నెలకొంది. యువత కేరింతలు.. సంబరాలు.. కేక్ కటింగ్‌లు.. బాణసంచా కాలుస్తూ సందడి చేసింది. పల్లె పట్టణం అన్న తేడా లేకుండా జిల్లా అంతటా నూతన సంవత్సర సందడి నెలకుంది. ఆదివారం అర్ధరాత్రి 12 గంటలకు కొత్త సంవత్సరానికి జిల్లావాసులు ఘనంగా స్వాగతం పలికారు. యువకులు నయా జోష్‌తో సందడి చేశారు. మహిళలు రంగవల్లులతో నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. విద్యా సంస్థల్లో నూతన సంవత్సర వేడుకలను విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. నరసరావుపేట, చిలకలూరిపేట, వినుకొండ, సత్తెనపల్లి, పిడుగురాళ్ల, మాచర్ల పట్టణాల్లో యువకుల కోలాహలం నెలకుంది. చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. చర్చిలు, వ్యాపార, విద్యా సంస్థలను రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. కొనుగోలుదారులతో స్వీట్స్ షాపులు, బేకరీలు కిటకిటలాడాయి. కేక్‌ల కొనుగోలుకు బంపర్ ఆఫర్లు ఇచ్చారు. రెస్టారెంట్లలో కూడా ఆఫర్లు ఇచ్చారు. యువకులు ద్విచక్ర వాహనాలపై తిరుగుతూ ఒకరికొకరు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసుకుంటూ రోడ్లపై సందడి చేశారు. పోలీసులు శాంతి భద్రతలు దృష్టిలో ఉంచుకుని ఆంక్షలు విధించినా యువత సందడి ఏమాత్రం తగ్గలేదు. పోలీసులు పలు ప్రాంతాల్లో డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించారు.



నరసరావుపేటలో మోకాళ్లపై నిల్చొని నిరసన తెలియజేస్తున్న సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు

అదరం.. బెదరం..

- అంగన్‌వాడీల ఆందోళనలు ఉధృతం
- తగ్గేదేలే అంటున్న మున్సిపల్ కార్మికులు
- 12వ రోజుకు సమగ్ర శిక్షా అభియాన్ సమ్మె

నరసరావుపేట, డిసెంబరు 31: సమస్యల పరిష్కారం కోరుతూ అంగన్‌వాడీలు, మున్సిపల్ కార్మికులు, సమగ్ర శిక్షా అభియాన్ ఆందోళనలు ఉధృతంగా సాగుతున్నాయి. అంగన్‌వాడీల సమ్మె ఆదివారం 20వ రోజు కొనసాగింది. నరసరావుపేటలో ఒకవైపు అంగన్‌వాడీలు, మరో వైపు సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో ధర్నా చౌక్ దద్దరిల్లింది. సమగ్ర శిక్షా ఉద్యోగుల నిరవధిక సమ్మె 12వ చేరింది. మున్సిపల్ కార్మికులు సమ్మెను ఉధృతం చేశారు. ప్రైవేట్ వర్కర్లతో పారిశుధ్య పనులు చేపట్టేందుకు పురపాలకులు చేపట్టిన చర్యలను కార్మికులు ఎక్కడికక్కడ అడ్డుకుంటున్నారు. నరసరావుపేటలో పోలీసులు బందోబస్తుతో పారిశుధ్య పనులను అడ్డుకున్నారు. కార్మికులు వాటర్ ట్యాంక్ ఎక్కి నిరసన తెలిపారు. అధికారుల చర్యలను నిరసిస్తూ వాటర్ ట్యాంక్ ఎక్కడంతో కమిషనర్ రామ్మోహనరావు కార్మికులతో చర్చలు జరిపారు. వారి డిమాండ్లను కమిషనర్ ఆమోదించడంతో వాటర్ ట్యాంక్‌పై నుంచి కార్మికులు కిందకు దిగి మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు.



వాటర్ ట్యాంక్ ఎక్కి నిరసన తెలియజేస్తున్న మునిసిపల్ కార్మికులు



వైసీపీని.. వీడుతున్నారు

- వేమూరులో అసమ్మతి జ్వాలలు
- ద్వితీయ శ్రేణి నేతల రాజీనామాల బాట
- తెరపైకి వస్తున్న మంత్రి నాగార్జున బాధితులు
- మేరుగ ఇబ్బంది పెట్టారని రాష్ట్ర ప్రచార కార్యదర్శి రాజీనామా
- మూడు గ్రామాలకు చెందిన నాయకులూ మురళీకృష్ణ బాటలో

బాపట్ల, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలు సమీపిస్తున్నాయి.. ఈ తరుణంలో నేతలు గెలుపు కోసం ప్రణాళికలు రూపొందించుకోవాలి.. కాని అధికార వైసీపీలో అసమ్మతి జ్వాలలు రగులుతున్నాయి. ప్రధానంగా వేమూరు నియోజకవర్గంలో తాజాగా పలువురు రాజీనామాల బాట పట్టడంతో వైసీపీలో కలకలం రేగింది. ఇప్పటికే ప్రజల నుంచి ఎదురవుతున్న వ్యతిరేకతను తప్పించుకోవడానికి వేమూరు ఎమ్మెల్యే, మంత్రి మేరుగ నాగార్జున ప్రకాశం జిల్లా కొండపికి మారిన సంగతి తెలిసిందే. అయినా మంత్రిపైన అసమ్మతి జ్వాలలు రగులుతూనే ఉన్నాయి. నాలుగున్నరేళ్లలో ఆయన పెట్టిన ఇబ్బందులకు బాధితులుగా మిగలామంటూ అధికార పార్టీకి చెందిన వారే ఒక్కొక్కరిగా తెరమీదకు వస్తున్నారు. వైసీపీ రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తున్న వేమూరికి చెందిన మురళీకృష్ణ ఆదివారం పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఆయనతో పాటు నియోజకవర్గం పరిధిలోని బలిజేపల్లి, వరాహపురం, అబ్బనగూడవల్లి గ్రామాలకు చెందిన నాయకులు కూడా పార్టీని వీడటం చర్చకు దారితీసింది. ఈ సందర్భంగా మంత్రి లక్ష్యంగా మురళీకృష్ణ పలు విమర్శలను ఎక్కుపెట్టారు. పార్టీ కోసం పనిచేసిన వారిని ఇబ్బంది పెడుతూ, పనిచేయని వ్యక్తులను పార్టీలోనికి ఆహ్వానించి అందలం ఎక్కించారని మంత్రిపై మండిపడ్డారు. పదేళ్లుగా వైసీపీ రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా పార్టీ అభివృద్ధికి ఎంతో కష్టపడ్డానని, కానీ తనకు అవమనాలు మాత్రమే మిగిలాయని వాపోయారు. అభివృద్ధి లేని చోట తాము ఉండకూడదన్న నిర్ణయానికి వచ్చి రాజీనామాలు చేస్తున్నామని మురళీకృష్ణ ప్రకటించారు. మంత్రి వ్యవహారశైలితో అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నామని, భరించలేకే పార్టీని వీడుతున్నట్లు తెలిపారు. పార్టీని వీడిన వారిలో మురళీకృష్ణతో పాటు నాయకులు కస్తూరి బాబురావు, పంచాయతీ వార్డు సభ్యులు వల్లభాపురం లీలాకృష్ణ, లావు బోసు, గోపిశెట్టి వెంకటేశ్వరరావు, చిలక రాజేశ్‌రాంబాబు తదితరులు ఉన్నారు.

మంత్రి తీరుపై ఆగ్రహం..

మంత్రి చేసిన తప్పిదాలు సొంత పార్టీ నాయకులను, కార్యకర్తలను వేధించిన ఉదంతాలు కోకొల్లలుగా ఉండటంతో ఒక్కొక్కరుగా బయటకు వచ్చి ఆగ్రహాన్ని వెళ్లగక్కుతున్నారు. దీనికి తోడు కొత్త ఇన్‌ఛార్జిగా నియమితుడైన వరికూటి అశోక్‌బాబుకు సైతం శ్రేణుల నుంచి మద్దతు లభించడం లేదు. రాబోయే రోజుల్లో ఈ రాజీనామాల పర్వం ఊపందుకుని అసమ్మతి జ్వాలలు మరింతగా ఎగిసిపడే అవకాశాలు కనిపిస్తున్నాయి.

దేవినేని ఫ్లెక్సీల కలకలం

భట్టిప్రోలు మండలం వరికూటివారిపాలెంలో ఆదివారం దేవినేని మల్లికార్జునరావు ఫొటోతో వెలిసిన ఫ్లెక్సీలు కలకలం సృష్టించాయి. రేపల్లె మాజీ ఎమ్మెల్యే, ప్రస్తుత బుడా(బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ) చైర్మన్‌గా వ్యవహరిస్తున్న వైసీపీ నేత దేవినేని మల్లికార్జునరావు ఫొటోలతో వేసిన టీడీపీ ఫ్లెక్సీలు సంచలనమైంది. మాజీ ఎమ్మెల్యే దేవినేనికి వేమూరి నియోజకవర్గంలో గణనీయంగా ఓట్లు ప్రభావితం చేయగల నేతగా పేరుంది. 2019 ఎన్నికల్లో మంత్రి మేరుగ గెలవడానికి ప్రధాన కారణం కూడా ఆయనేనన్న చర్చ ఉంది. ప్రస్తుతం టీడీపీ ఫ్లెక్సీల్లో చంద్రబాబు, పవన్‌కల్యాణ్, లోకేశ్, మాజీ మంత్రి నక్కా ఆనంద్‌బాబు ఫొటోల సరసన దేవినేని ఫొటో ఉండటం, రాబోయే రోజుల్లో రాజకీయంగా ఆయన అడుగులు కూడా టీడీపీ వైపేనన్న చర్చ నడుస్తోంది. మాజీ ఎమ్మెల్యే దేవినేనికి ఎంపీ మోపిదేవికి మధ్య సన్నిహిత సంబంధాలున్నాయి.

మూడు రోజుల పాటు ధర్మవరం ఎక్స్‌ప్రెస్ దారి మళ్లింపు

గుంటూరు, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): నిత్యం గుంటూరు మీదగా రాకపోకలు సాగించే మచిలీపట్నం-ధర్మవరం-మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్ రైలుని మూడు రోజులపాటు దారి మళ్లిస్తున్నట్లు గుంటూరు డీఆర్ఎం ఎం రామకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నెం.17215 మచిలీపట్నం-ధర్మవరం ఎక్స్‌ప్రెస్‌ని జగ్గంబొట్ల కృష్ణాపురం-గిద్దలూరు మధ్యన ఎన్ఐ వర్కులు కారణంగా జనవరి 2 నుంచి 4వ తేదీ వరకు గుంటూరు మీదగా కాకుండా తెనాలి-రేణిగుంట, పాకాల, మదనపల్లె మీదగా నడపడం జరుగుతుందన్నారు. అలానే నెం.17215 ధర్మవరం - మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్‌ని జనవరి 3 నుంచి 5వ తేదీ వరకు మదనపల్లె-పాకాల-రేణిగుంట-తెనాలి-విజయవాడ మీదగా మళ్లిస్తామన్నారు. ఈ మార్పులను ప్రయాణీకులు గమనించి రైల్వేకి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

గుంటూరు మీదగా శ్రీకాకుళం రోడ్, వికారబాద్‌కు ప్రత్యేక రైళ్లు

గుంటూరు, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండగ సెలవుల రద్దీ దృష్ట్యా గుంటూరు మీదగా శ్రీకాకుళం రోడ్డు, వికారాబాద్‌లకు ప్రత్యేక రైళ్లను నడవనున్నట్లు తూర్పు కోస్తా రైల్వే వర్గాలు తెలిపాయి. నెంబరు. 08547 శ్రీకాకుళం రోడ్డు - వికారాబాద్ రైలు జనవరి 12, 19, 26(శుక్రవారం) తేదీల్లో సాయంత్రం 5 గంటలకు బయలుదేరి అర్ధరాత్రి దాటాక 1.30కి గుంటూరు, 2.43కి సత్తెనపల్లి, శనివారం ఉదయం 6.40కి సికింద్రాబాద్, 9 గంటలకు వికారాబాద్ చేరుకొంటుంది. నెం.08548 వికారబాద్-శ్రీకాకుళం రోడ్డు రైలు జనవరి 13, 20, 27(శనివారం) తేదీల్లో రాత్రి 8.25 గంటలకు బయలుదేరి సికింద్రాబాద్ మీదగా అర్ధరాత్రి దాటాక 1.49కి సత్తెనపల్లి, 3.15కి గుంటూరు, ఆదివారం మధ్యాహ్నం 12.15కి శ్రీకాకుళం రోడ్డుకు చేరుకొంటుంది. ఈ రైళ్లు ఏసీ టూటైర్, త్రీటైర్, స్లీపర్, జనరల్ భోగీలతో ప్రయాణిస్తాయని రైల్వేవర్గాలు పేర్కొన్నాయి.

నూతన సంవత్సరంలో వెలుగులు రావాలి

- మూడు ముక్కల చీకటిని తరిమి కొడతాం
- 1475వ రోజుకు చేరిన రైతుల ఆందోళన



బిల్డ్ అమరావతి అంటూ మందడం శిబిరంలో నినాదాలు రైతులు

తుళ్లూరు, డిసెంబర్ 31: నూతన సంవత్సరంలో రాజధాని అమరావతికి భూములిచ్చిన రైతులకు వెలుగు రావాలని, సీఎం జగన్‌రెడ్డి ఆడుతున్న మూడు ముక్కల చీకటిని తరిమి కొడతామని 33వేల ఎకరాలిచ్చిన రైతులు అన్నారు. బిల్డ్ అమరావతి సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, రైతు కూలీలు, మహిళలు చేస్తున్న ఆందోళన ఆదివారం నాటికి 1475వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా రైతు ధర్నా శిబిరాల నుండి వారు మాట్లాడుతూ కొత్త సంవత్సరంలోనైనా కష్టాలు తొలగాలని కోరుకుంటున్నామన్నారు. రాష్ట్రానికి పట్టిన దరిద్రం వదలాలని ఆశిస్తున్నట్టు తెలిపారు. మూడు రాజధానులని సీఎం జగన్‌రెడ్డి అమరావతిని నిర్వీర్యం చేశాడన్నారు. దానివలన రాష్ట్రానికి కూడా తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. ప్రజాదరణ లేని పాలకులు ఉన్నా లేకున్నా ఒకటేనన్నారు. వైసీపీని గద్దె దించి రాష్ట్రాన్ని కాపాడుకోవాలని ఐదు కోట్ల మంది ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. బిల్డ్ అమరావతి అంటూ దీపాలు వెలిగించి నినాదాలు చేశారు. రాజధాని 29 గ్రామాలలో ఆందోళనలు కొనసాగాయి.

సైకిల్‌ను ఢీకొట్టి ద్విచక్ర వాహనదారుడి మృతి

వినుకొండటౌన్, డిసెంబరు 31: ఎదురుగా వస్తున్న సైకిల్‌ను బైక్‌తో ఢీకొట్టిన వ్యక్తి మృతిచెందిన సంఘటన మండలంలోని విఠంరాజుపల్లి గ్రామ సమీపంలో కోల్డ్‌స్టోరేజీ వద్ద ఆదివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలను పరిశీలిస్తే.. ప్రకాశం జిల్లా దొనకొండ మండలం రామక్కపల్లి గ్రామానికి చెందిన పగిడిపోగు బెన్నయ్య(40) శావల్యాపురం రైల్వేగ్యాంగ్‌లో పనిచేస్తూ నరసరావుపేటలో నివాసం ఉంటున్నాడు. బైక్‌పై ప్రయాణిస్తూ ఎదురుగా వస్తున్న సైకిల్‌ను బలంగా ఢీకొనడంతో బెన్నయ్య కిందపడి తలకు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ప్రమాదంలో గాయపడిన శావల్యాపురం మండలం కనమర్లపూడి గ్రామానికి చెందిన సాతులూరి నాగేశ్వరరావును 108 వాహనం ద్వారా వినుకొండ తరలించి ప్రథమ చికిత్స అనంతరం గుంటూరు తరలించారు. బెన్నయ్య మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వినుకొండ ప్రభుత్వవైద్యశాలకు తరలించారు. సమాచారం తెలుసుకున్న రైల్వే సిబ్బంది, కుటుంబసభ్యులు వైద్యశాలకు చేరుకొని కన్నీరుమున్నీరుగా విలపించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లక్ష్మీప్రసాద్ తెలిపారు.

సాగర్‌లో పర్యాటకుల సందడి



కొండను సందర్శించి వస్తున్న పర్యాటకులు

విజయపురిసౌత్, డిసెంబరు 31: ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జున సాగర్ విజయపురిసౌత్‌లో ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. సెలవు దినం, నూతన సంవత్సరం వస్తుండడంతో తెలుగు రాష్ట్రాల నుంచి భారీగా పర్యాటకులు వచ్చారు. స్థానిక లాంచీ స్టేషన్ నుంచి లాంచీల్లో నాగార్జున కొండకు చేరుకున్నారు. మ్యూజియంలోని బుద్ధుని ప్రతిమలు, రాతి పనిముట్లు, మట్టికుండలు, 9 అడుగుల బుద్ధుని పాలరాతి విగ్రహం, మహాస్థూపం, అశ్వమేధ యజ్ఞశాల, బోధివృక్షాన్ని సందర్శించారు. అనంతరం అనుపు, ఎత్తిపోతల జలపాతం అందాలను వీక్షించారు.



తాగండి.. తూగండి..

- అమ్మకాల పెంచేలా మద్యం పాలసీ
- ధరలు తగ్గింపు.. అందుబాటులో షాపుల ఏర్పాటు
- రెండు నెలల్లో రెండు సార్లు ధరలు తగ్గించిన ప్రభుత్వం
- నిషేధంపై మడమ తిప్పి మందుబాబులకు ప్రోత్సాహం
- నూతన సంవత్సరాది రెండు రోజులు రాత్రి 12 వరకూ మద్యం షాపులు

తాగండి.. తూగండి.. ఖజానాను గలగలలాడించండి.. ధరలు ఎక్కువగా ఉన్నాయా అయితే తగ్గిస్తాం.. మద్యం ఎక్కడ కావాలంటే అక్కడ అందుబాటులోకి తెచ్చాం.. వైన్స్, లిక్కర్ మార్ట్‌లు ఎక్కడికక్కడ ఏర్పాటు చేశాం.. తాగడం మాత్రం మానొద్దు. నూతన సంవత్సరం సందర్భంగా దుకాణాల వేళలు కూడా పెంచాం.. బాగా తాగండి.. మద్య నిషేధం చేస్తానని మహిళల ఓట్లు వేయించుకుని అధికారంలోకి వచ్చాక వైసీపీ అధినేత జగన్ ఆ హామీని తుంగలో తొక్కారు. మద్య నిషేధం మాటను పక్కనబెట్టి మద్యం తాగించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఉంది. అధికారం చేపట్టిన తొలి రెండేళ్లలో మద్య నిషేధం పేరుతో నానా హడావుడి చేసిన ప్రభుత్వం ఆ తర్వాత మద్యం తాగించడమే ధ్యేయమన్నట్లుగా మద్యం పాలసీ ప్రవేశపెట్టింది. మద్యం అమ్మకాలు పెంచడానికి పడరాని పాట్లు పడుతోంది.

గుంటూరు, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): మద్య నిషేధంపై మాట తప్పి మడమ తిప్పిన విషయాన్ని పక్కనపెట్టి మందుబాబులను ప్రోత్సహిస్తోంది. మందుకు దూరమైన వారిని కూడా తిరిగి రాబట్టాలనే ఉద్దేశంతో ఎప్పటికప్పుడు దుకాణాలు పెంచుతూ, ధరలు తగ్గిస్తూ మందుబాబులకు ఎరవేస్తోంది. గడిచిన రెండు నెలల్లోనే రెండుసార్లు మద్యం ధరలు తగ్గించి నిషేధ లక్ష్యానికి తూట్లు పొడుస్తోంది. వైసీపీ అధికారంలోకి రావడంతోనే పేదల కష్టార్జితాన్ని కొల్లగొట్టే పనిలోపడింది. ధరలు పెంచితే మద్యం తాగడం మానేస్తారని వంక పెట్టి మందు ధరలు పెంచి కష్టజీవుల ఆదాయాలను లూటీ చేస్తోంది. రోజంతా కష్టపడి సంపాదించిన కష్టార్జితం ఇల్లాలి చేతికి వెళ్లకుండానే మద్యం షాపుల్లో జమ చేసేసుకుంది. నాలుగున్నరేళ్లుగా నిషేధంపై మాయమాటలు చెబుతున్న ప్రభుత్వం మద్యం అమ్మకాలు తగ్గినప్పుడల్లా ధరలు తగ్గించి మందుబాబులను తెగ తాగించడమే పనిగా పెట్టుకుంది. గడిచిన నాలుగున్నరేళ్లలో రెండు సార్లు మద్యం షాపులు తగ్గించి నిషేధంపై హడావుడి చేసిన ప్రభుత్వం, వాక్-ఇన్, టూరిజం స్టోర్లు, మాల్స్ పేరిట ఇప్పటికి మూడుసార్లు షాపులు పెంచి, రెండు సార్లు బార్లకు అనుమతులు ఇచ్చి, మూడుసార్లు మద్యం ధరలు తగ్గించి మందుబాబులను ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం తాజాగా మరోమారు మద్యం ధరలు తగ్గించి నిషేధానికి మరోమారు తూట్లు పొడించింది. అమ్మకాలే లక్ష్యంగా ప్రభుత్వం మద్యం ధరలు తగ్గిస్తూ వస్తోంది. అమ్మకాలు తగ్గినప్పుడల్లా ధరలు తగ్గించి మందుబాబులు మద్యానికి దూరమవ్వకుండా జాగ్రత్త పడుతోంది. మద్యం ధరలు భారీగా పెంచిన తొలినాళ్లలో అమ్మకాలు భారీగా తగ్గాయి. దీంతో ప్రభుత్వం నిషేధ హామీకి తూట్లు పొడిచి 2020 అక్టోబరులో మద్యం ధరలను 25 శాతం తగ్గించింది. 2021 డిసెంబరులో ధరలను మరోమారు క్రమబద్ధీకరించి టాక్సులు తగ్గించింది. తిరిగి మద్యాన్ని ఏరులై పారించింది. కష్టజీవుల ఆదాయాన్ని అడ్డూ అదుపు లేకుండా కొల్లగొట్టింది. కార్తీకమాసం ప్రభావం, పండుగల నేపథ్యంలో భక్తుల మాలధారణల నేపథ్యంలో మద్యం అమ్మకాలు కొంతమేర తగ్గాయి. ఆ మాత్రం అమ్మకాలు తగ్గడం కూడా ఇష్టపడని ప్రభుత్వం ఈ నవంబరు 18న ధరలు తగ్గించింది. ధరల క్రమబద్ధీకరణ పేరుతో నాశిరకం బ్రాండ్ల ధరలు తగ్గించి, బ్రాండెడ్ మద్యం ధరలను మాత్రం భారీగా పెంచారు. నాశిరకం మద్యం వల్ల ఆరోగ్యం దెబ్బతింటుండడంతో అమ్మకాలు ఆశించిన స్థాయిలో పెరగలేదు. దీంతో ప్రభుత్వం 40 రోజుల వ్యవధిలోనే మరోమారు మద్యం ధరలు తగ్గించింది. ధరల సవరణ పేరుతో 15 రకాలు స్కాచ్, విస్కీల ధరలను మదింపు చేసిన ప్రభుత్వం ఒకటి రెండు బ్రాండ్లకు ధరలను పెంచి, మిగిలిన అన్ని బ్రాండ్లకు ధరలు భారీగా పెంచింది. దీంతో మద్య నిషేధంపై తనకు ఎలాంటి చిత్తశుద్ధి లేదని తేల్చి చెప్పింది. మద్య నిషేధం చేసే ఓట్లడుగుతానని గత ఎన్నికల ప్రచారంలో మైకుల్లో హోరెత్తించిన ముఖ్యమంత్రి ప్రజలు ఆ మాట మర్చిపోయారన్న ప్రగాఢ విశ్వాసంతో నిషేధం చేయకుండానే ఓట్లడిగేందుకు ప్రజల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతున్నారు.

రాత్రి 12 వరకూ మద్యం షాపులు

ప్రజలను తాగించడమే లక్ష్యంగా పెట్టు కున్న ప్రభుత్వం కొత్త సంవత్సర వేడు కలను స ద్వినియోగం చేసు కునే పనిలో పడింది. మద్య నిషే ధం సంగతేమోగాని కొత్త సంవత్సరం వేడుకల్లో మద్యా న్ని పారించేందుకు అన్ని విధాలా ఏర్పాట్లుచేసింది. డి సెంబరు 31, జనవరి 1వ తేదీల్లో అర్ధరాత్రి 12 గంటల వరకూ చర్యలు తీసుకుంది. ఆ మేరకు షాపులు తెరి చి ఉంచేందుకు మూడు జిల్లాల ఎక్సైజ్ అధికారు లు ఆదేశాలు జారీచేశారు. మద్యం, బీరు కొర త రాకుండా ముందు గానే షాపులను సరుకుతో నింపేశారు.

మద్యం ధరల వివరాలు

బ్రాండు పేరు	పాత ధర	కొత్త ధర
• కెటెల్ వన్ ఓడ్కా	3,190	2,730
• జే అండ్ బీ రేర్	3,130	2,650
• జానీవాకర్స్ రెడ్‌లేబుల్	2,760	2,440
• బీఫ్‌ఈటర్ లండన్ జిన్	2,450	2,080
• అబ్సొల్యూట్ ఓడ్కా	2,510	2,180
• అబ్సొల్యూట్ సిట్రోన్	2,590	2,240
• జామ్సన్ ఐరిష్ విస్కీ	2,840	2,530
• చివాస్ రీగల్ స్కాచ్	4,840	4,780
• జానీవాకర్ బ్లాక్‌లేబుల్	4,490	4,950

రాత్రి 12 వరకూ మద్యం షాపులు

ప్రజలను తాగించడమే లక్ష్యంగా పెట్టుకున్న ప్రభుత్వం కొత్త సంవత్సర వేడుకలను సద్వినియోగం చేసుకునే పనిలో పడింది. మద్య నిషేధం సంగతేమోగాని కొత్త సంవత్సరం వేడుకల్లో మద్యాన్ని పారించేందుకు అన్నివిధాలా ఏర్పాట్లుచేసింది. డిసెంబరు 31, జనవరి 1వ తేదీల్లో అర్ధరాత్రి 12గంటల వరకూ చర్యలు తీసుకుంది. ఆ మేరకు షాపులు తెరిచిఉంచేందుకు మూడు జిల్లాల ఎక్సైజ్ అధికారులు ఆదేశాలు జారీచేశారు. మద్యం, బీరు కొరత రాకుండా ముందుగానే షాపులను సరుకుతో నింపేశారు.

లోకేశ్ సహకారంతో చేనేత కార్మికులకు రాట్నాలు

- ఆరో విడతలో వంద మందికి పంపిణీ
- స్థానిక నేతలతో రాట్నాలు పంపిణీ చేయించిన లోకేశ్



చేనేత కార్మికులకు రాట్నాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

మంగళగిరి సిటీ, డిసెంబరు 31: చేనేత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న మహిళలకు చేనేతకు చేయూత పేరిట టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ చేయూతనందిస్తున్నారు. ఇప్పటికే అయిదు విడతల్లో వందలాది మంది నేత కార్మికులకు వృత్తి పరమైన పరికరాలు అందజేశారు. ఆరో విడతలో పట్టణంలోని 10, 11, 21, 22, 27 వార్డుల కు చెందిన వందమంది చేనేత మహిళలకు ఆదివారం నూలు వడికే యంత్రాలను అందజే శారు. రత్నాలచెరువులోని భావనారుషి స్వామి గుడి వద్ద టీడీపీ పట్టణ అధ్యక్షుడు దామ ర్ల రాజు ఆధ్వర్యంలో చేనేత మహిళలకు ఈ రాట్నాలను పంపిణీ చేయించారు. ఈ సంద ర్భంగా టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త నందం అబద్దయ్య మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో టీడీపీ-జనసేన పొత్తుతో మంగళగిరిలో లోకేశ్ అత్యధిక మెజార్టీతో గెలవ బోతున్నారని చెప్పారు. అధికారంలో లేకపోయినా అన్ని వర్గాల సంక్షేమం కోసం లోకేశ్ తన సొంత ఖర్చులతో 27 సంక్షేమ కార్యక్రమాలను అమలుచేస్తున్నారని తెలిపారు. జగన్ అసమర్థత కారణంగా రాష్ట్రంలో 60మంది చేనేత కార్మికులు ఆత్మహత్య చేసుకున్నారన్నా రు. చంద్రబాబు హయాంలో నూలు, రంగు, రసాయనాలపై సబ్సిడీ, చేనేత సహాయ నిధి, పొదుపు నిధి, రంగుల కోసం రూ.25కోట్లు, మూలధనం కింద రూ.30కోట్లు, మరమగ్గాలకు 50శాతం రాయితీ కోసం రూ.80కోట్లు ఖర్చుచేశారని గుర్తుచేశారు. వైసీపీ ప్రభుత్వం కేవలం పదిశాతం మందికే నేతన్ననేస్తం అందిస్తూ గొప్పగా ప్రచారం చేసుకుంటోందన్నారు. రాబోయే ఎన్నికల్లో చేనేతలంతా ఐక్యంగాటీడీపీకి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ బీసీసెల్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి గుత్తికొండ ధనుంజయరావు, ఉపాధ్యక్షుడు కాండ్రు శ్రీనివాసరావు, నేతలు జంజనం వెంకట సుబ్బారావు, మునగపాటి వెంకటేశ్వరరావు, కారంపూడి అంకమ్మరావు, తిరువీధుల బాపనయ్య, పడవల మహేష్, షేక్ రియాజ్, గోవాడ దుర్గారావు, విన్నకోట శ్రీనివాసరావు, పందేటి తిరుపతయ్య, వాకా మాధవరావు, వి.పెదలక్ష్మయ్య, షేక్ సుభానీ, గోసాల రాఘవ, బాలాజీగుప్తా, చిలకా వెంకటేశ్వరరావు, కొత్తపేట హుస్సేన్, జొన్నాదుల బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జగన్‌ను ఇంటికి పంపాలి

సత్తెనపల్లి, డిసెంబరు 31: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని ఇంటికి పంపకపోతే రాష్ట్రానికి అదోగతేనని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కన్నా లక్ష్మీనారాయణ ఆదివారం పేర్కొన్నారు. వైసీపీ మేనిఫెస్టోను భగవద్గీత, బైబిల్ అని చెప్పుకొనే జగన్, హామీలను అమలుచేయకుండా ప్రజలను మభ్య పెట్టి మోసం చేశారన్నారు. ఎన్నికల సమయంలో 730 హామీలు ఇచ్చి నవరత్నాల పేరుతో ప్రజలను నట్టేట ముంచారన్నారు. అలివికాని హామీలను ఇచ్చి నూరుశాతం హామీలను నెరవేర్చారని చెప్పుకోవటం సిగ్గు చేటన్నారు. అసత్యాలు పలకటంలో జగన్ ఆరితేరారన్నారు. రాష్ట్రానికి జీవనాడి అయిన పోలవరాన్ని 2022కు పూర్తి చేస్తానని చెప్పి రివర్స్ టెండర్లు పిలిచి తీరని అన్యాయం చేశారన్నారు. 25 ఎంపీ సీట్లు ఇస్తే కేంద్రం మెడలు వంచి ప్రత్యేక హోదా తెస్తానన్న జగన్ మోహన్‌రెడ్డి ఢిల్లీ పాలకులకు వంగి వంగి దండం పెడుతూ ఆంధ్రుల బంగారు భవిష్యత్‌ను నాశనం చేశారని మండిపడ్డారు. ప్రతి ఏటా జనవరిలో జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తానని నిరుద్యోగులను నిండా ముంచారన్నారు. రాష్ట్రంలో అన్నివర్గాలపై అరాచకాలు, దౌర్జన్యాలు పెరిగాయన్నారు. నిరుద్యోగులను అన్ని విధాలుగా మోసం చేశారన్నారు. వైసీపీ అరాచక పాలన, దుందుడుకు చర్యలను చూసి నాలుగున్నర సంవత్సరాల్లో ఒక కొత్త పరిశ్రమ కూడా రాలేదన్నారు. పైగా ఉన్నవి కూడా పక్క రాష్ట్రాలకు వెళ్లి పోయాయన్నారు. వైసీపీ పాలకులు గంజాయి, మాదక ద్రవ్యాల మాఫియాను ప్రోత్సహిస్తూ వేలాది మంది యువకుల జీవితాలను కాల రాస్తున్నారన్నారు. ఎన్నికలు ఎప్పుడు వస్తాయా?, ఈ ప్రభుత్వానికి ఎప్పుడు బుద్ధి చెబుదామా? అని రాష్ట్ర ప్రజలు ఎదురు చూస్తున్నారన్నారు. అంగన్‌వాడీలకు, మునిసిపల్ పారిశుధ్య కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయటంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. 2024లో టీడీపీ విజయం ఖాయమనే ధీమా వ్యక్తం చేశారు.

ప్రేమించి పెళ్లి చేసుకుని వేధిస్తున్నాడని అల్లుడి హత్య

హత్య కేసులో నిందితుల అరెస్టు

తెనాలి రూరల్, డిసెంబరు 31: ప్రేమించి పెళ్లి చేసుకున్న కుమార్తెతో వెట్టిచాకిరి చేయిస్తున్న అల్లుడ్ని హత్య చేసిన బంధువుల్ని పోలీసులు అరెస్టు చేశారు. తెనాలి మండలం కఠెవరంలో ఈ నెల 25న జరిగిన హత్య కేసులో నిందితులను ఆదివారం రూరల్ సీఐ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో హాజరుపరిచి కేసు వివరాలను డీఎస్పీ జనార్ధనరావు తెలిపారు. పెయింటింగ్ పని చేసే తెనాలి మండలం కఠెవరానికి చెందిన గేర వాసు నాలుగేళ్ల క్రితం అదే గ్రామానికి చెందిన వెన్నెలను ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. ఇటీవల వాసు తల్లికి పక్షవాతం వచ్చింది. ఈ క్రమంలో వెన్నెలను చూసేందుకు వచ్చిన తండ్రి అబ్రహం చాకిరి చేస్తున్న కూతురును చూసి అల్లుడ్ని ప్రశ్నించాడు. వాసు మామపై కోపగించుకుని తిడుతూ ఆయన్ను ఇంటి నుంచి గెంటేశాడు. ఆయన అదే గ్రామంలో ఉంటున్న బంధువు మేరి ఇంటి వద్దకు వెళ్లి జరిగిన విషయాన్ని తెలిపాడు. దీంతో మేరి భర్త, వారి బంధువులు వాసు ఇంటికి వెళ్లగా వారి మధ్య ఘర్షణ జరిగింది. కత్తి, స్క్రూడ్రైవర్‌తో వాసును పొడవడంతో గాయపడిన వాసును ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. అబ్రహం బంధువుల దాడిలో వాసుకు మామ వరసయ్యే తిరుపతిరావు గాయపడగా వాసు సోదరుడు గోపి పారిపోయాడు. తిరుపతిరావు ఫిర్యాదుతో కేసు నమోదు చేసి విచారించిన రూరల్ సీఐ శ్రీనివాసరెడ్డి, ఎస్ఐ వెంకటేశ్వర్లు నిందితులైన తోకల అరవింద్‌నాగరాజు, మాతంగి ప్రకాష్‌తేజ, గోళ్ల జయంత్, కంచర్ల ప్రవీణ్, కోట రవికుమార్, తోకల మేరి, తోకల ప్రసాదరావు, కొండ్రు జీవన్, కొండ్రు యేసోబులను అరెస్టు చేశారు.

పాము కాటుకు గురై బాలుడి మృతి



దుర్గాప్రసాద్ (ఫైల్)

మంగళగిరి, డిసెంబరు 31: స్థానిక గండాలయపేటకు చెందిన పేరం దుర్గాప్రసాద్(14) అనే బాలుడు పాముకాటుకు గురై ఆదివారం మృతి చెందాడు. స్థానికులు వివరాల ప్రకారం.. సీకే హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న దుర్గాప్రసాద్ తండ్రి అర్జున్‌తోపాటు ఇటీవల భవానీ మాలదీక్షను స్వీకరించాడు. అపార్టుమెంట్‌లో వాచ్‌మెన్‌గా పనిచేసే అర్జున్ ఓ గదిలో అమ్మవారి పీఠం పెట్టుకుని పూజలు చేసుకుంటున్నారు. ఈ క్రమంలో అర్జున్, దుర్గాప్రసాద్‌లు శనివారం రాత్రి అమ్మవారి పీఠం ఉన్న గదిలో నిద్రించారు. ఆదివారం తెల్లవారుజామున దుర్గాప్రసాద్ కాలుపై పాము కాటు వేసింది. దీంతో బాలుడ్ని ప్రైవేటు ఆస్పత్రికి ఆ తర్వాత గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ బాలుడు ఆదివారం మృతిచెందాడు.

జగన్ భిక్షతో సత్తెనపల్లిలో
మంత్రి అంబటి రాంబాబు పోటీ

సత్తెనపల్లి, డిసెంబరు 31: రేపల్లె నియోజకవర్గంలో పోటీ చేసే దమ్ము లేక వైఎస్ జగన్ భిక్షతో సత్తెనపల్లిలో మంత్రి అంబటి రాంబాబు పోటీ చేశారని ముప్పాళ్ళ మాజీ జెడ్పీటీసీ, వైసీపీ మాజీ మండల కన్వీనర్ ఇందూరి నరసింహారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 1989లో ఎమ్మెల్యే అయిన అంబటి రాంబాబు 2019 వరకు ఎమ్మెల్యే కాలేక పోయారన్నారు. అదృష్టం కొద్ది గెలిచి మంత్రి అయిన అంబటి నియోజక వర్గంలో నోటి దూలతో, వెటకారపు మాటలతో, తలతిక్క చేష్టలతో వైసీపీ కార్యకర్తల తిరస్కరణకు గురయ్యారని పేర్కొన్నారు. నియోజకవర్గ ప్రజలు అంబటిని తిరస్కరిస్తున్నారన్నారు. కొంతమంది భజన బృందాన్ని వెంట వేసుకొని తిరగటం వల్లే అంబటికి ఈ గతి పట్టిందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎంపీపీ, జెడ్పీటీసీ, మునిసిపల్ చైర్మన్, కో-ఆప్షన్ పదవులు, మండల కన్వీనర్ పదవులను కూడా అంబటి అమ్ముకున్నారన్నారు. అంబటికి సీటు ఇచ్చినా ఓడిపోవటం ఖాయమని నరసింహారెడ్డి పేర్కొన్నారు.

5 వరకు కోర్టు విధుల బహిష్కరణ

గుంటూరు, డిసెంబరు 31: రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తెచ్చిన ల్యాండ్‌టైటలింగ్ యాక్ట్ రద్దు డిమాండ్‌తో ఈనెల 5 వరకు న్యాయవాదులు కోర్టు విధులు బహిష్కరించనున్నట్లు బార్ ఫెడరేషన్ చైర్మన్ కేవీకే సురేష్ తెలిపారు. విశాఖ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు రాంబాబు పేరుతో న్యాయవాదుల సమ్మె విరమణ అని ఆదివారం ప్రభుత్వపెద్దల సొంతపత్రికలో ప్రచురితమైన కథనంలో వాస్తవం లేదన్నారు. ఇది న్యాయవాదులను తప్పుదోవ పట్టించడానికి చేసిన చర్యగా పేర్కొన్నారు. చట్టాన్ని రద్దుచేస్తున్నట్లు ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర బార్‌కౌన్సిల్, వివిధ బార్ అసోసియేషన్‌ల ప్రతినిధులు హైకోర్టులో దాఖలు చేసిన రిట్ పిటీషన్‌లో వచ్చే ఉత్తర్వుల మేరకు తదుపరి కార్యాచరణ నిర్ణయిస్తామని తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.80
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	114, 122, 133
చికెన్ విత్ స్కిన్	214.00
చికెన్ స్కిన్ లెస్	224.00

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు

టీడీపీ గెలుపునకు కృషి చేయాలి : యరపతినేని

పిడుగురాళ్ల, డిసెంబరు 31 : రాబోయే ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం ప్రతి నాయకుడు, కార్యకర్త కలిసి పని చేయాలని గురజాల మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు కోరారు. పిడుగురాళ్ల పార్టీ కార్యాలయంలో జానపాడు గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలతో ఆదివారం సమావేశం నిర్వహించారు. రాబోయే ప్రజా ప్రభుత్వ ఏర్పాటుకు టీడీపీ, జనసేన కార్యకర్తలు ప్రణాళికతో ముందుకు పోవాలని, ప్రతి ఇంటికి వెళ్లి బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్డును అందిస్తూ తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పడిన తరువాత ప్రతి ఇంటికి జరిగే లబ్ధిని వివరించాలన్నారు. అదేవిధంగా నూతన సంవత్సర వేడుకలు పిలుట్ల రోడ్డులోని శివాలయం సమీపంలో ఉన్న కాకతీయ కల్యాణ మండపంలో జరుగుతున్న ఏర్పాట్లను యరపతినేని పరిశీలించి తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో పాండురంగ శ్రీను, వడ్డవల్లి సర్వేశ్వరరావు, కనిగిరి శ్రీను, కొమ్మినేని రామచంద్రరావు, వడ్డవల్లి సాంబశివరావు, దియ్యా శ్రీను, గండికోట వెంకటేశ్వర్లు, చింతలపూడి రామ్మూర్తి, ముప్పాళ్ల సాంబయ్య, వున్నం సురేష్, ఎల్‌వీఆర్, జొన్నలగడ్డ శ్రీను, దియ్యా రామక్రిష్ణ, బొల్లా శ్రీను తదితరులు పాల్గొన్నారు.


పిడుగురాళ్లలో పార్టీ శ్రేణులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

నేతల నూతన సంవత్సర శుభాకాంక్షలు

సత్తెనపల్లి, డిసెంబరు 31 : సత్తెనపల్లి నియోజకవర్గ ప్రజలకు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కన్నా లక్ష్మీనారాయణ, మాజీ ఎమ్మెల్యేలు యరపతినేని శ్రీనివాసరావు, యర్రం వెంకటేశ్వరరెడ్డి, వైవీ ఆంజనేయులు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కనుమూరి బాజీచౌదరి, సత్తెనపల్లి నియోజకవర్గ టీడీపీ నేత నాగోతు శౌరయ్య, మునిసిపల్ మాజీ చైర్మన్ ఎలినేడి రామస్వామి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చిట్టా విజయ భాస్కర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నూతన సంవత్సరం ప్రతి ఒక్కరి జీవితాల్లో ఆనందాలు నింపాలని, అందరూ సుఖ సంతోషాలతో ఉండాలన్నారు.

యూటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరించిన ఎంఈవోలు

క్రోసూరు, డిసెంబరు 31 : క్రోసూరు మండల యూటీఎఫ్ ప్రచురించిన 2024 క్యాలెండర్‌ను ఆదివారం క్రోసూరు-1 ఎంఈవో ఏకుల ప్రసాదరావు, ఎంఈవో - 2 ఎం గణేష్, ఈవోపీఆర్‌డీ పీ శివరామయ్య చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఎంఈవో ఏకుల ప్రసాదరావు మాట్లాడుతూ ఉపాధ్యాయులందరికీ ముందస్తు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియ జేశారు. డైరీలను కూడా ఆవిష్కరించి దానిలో ఉన్న జీవోలు, ఇతర సమాచారం ఉపాధ్యాయులకు ఉపయుక్తంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు గోళ్ళ నరసింహారెడ్డి, జిల్లా కార్యదర్శి ప్రకాష్, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జీ లూకా, షేక్ ఖాజావలి, యూటీఎఫ్ నాయకులు కుంభా శ్రీనివాసరావు, కొనకంచి లక్ష్మణరావు, గోవిందరెడ్డి, ఉసిరికాయల వెంకటరావు, జయంతి, పోతయ్య, మాధవరావు తదితరులు పాల్గొన్నారు.


నూతన సంవత్సర మరియు
సంక్రాంతి శుభాకాంక్షలు
2024
HAPPY NEW YEAR
తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రివర్యులు,
స్వర్ణాంధ్ర రథసారథి మా ప్రియతమ నాయకులు,
గౌ॥ మాన్యశ్రీ నారా చంద్రబాబు నాయుడు గారికి,
తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి శ్రీ నారా లోకేష్ గారికి
తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు శ్రీ కింజరాపు అచ్చెన్నాయుడు గారికి.
జనసేన పార్టీ అధ్యక్షులు శ్రీ కొణిదెల పవన్ కళ్యాణ్ గారికి,
సత్తెనపల్లి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జ్ శ్రీ కన్నా లక్ష్మీనారాయణ గారికి.
నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులకు, కార్యకర్తలకు,
అభిమానులకు, నియోజకవర్గ ప్రజలందరికీ నా హృదయపూర్వక
నూతన సంవత్సర మరియు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేస్తూ...
సదా మీ సేవలో
నాగోతు శౌరయ్య
సత్తెనపల్లి నియోజకవర్గ
తెలుగుదేశం పార్టీ నాయకులు
T.D.P

ప్రభుత్వ వైఫల్యాలపై బుక్‌లెట్ ఆవిష్కరణ

సత్తెనపల్లి, డిసెంబరు 31 : పట్టణంలోని రఘు రామ్‌నగర్‌లో గల తన కార్యాలయంలో ప్రభుత్వ వైఫల్యాలకు సంబంధించిన బుక్‌లెట్‌లను ఆదివారం టీడీపీ నేతలతో కలసి నియోజకవర్గ ఇన్‌చార్జి కన్నా లక్ష్మీనారాయణ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో 730 హామీలు ఇచ్చిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వాటిని అమలు చేయటంలో పూర్తిగా విఫలమయ్యారన్నారు. దీనికి సంబంధించిన ఆధారాలతో సహా బుక్‌లెట్‌ను కన్నా, పార్టీ నా యకులు విడుదల చేశారు. కార్యక్రమంలో ఆయా మండలాల పార్టీ అధ్యక్షులు ఆళ్ళ అమరేశ్వరరావు, బత్తుల నాగేశ్వరరావు, పల్ల పాటి పెద్దిరాజు, నాదెండ్ల సత్యనారాయణ, పట్టణ అధ్యక్షుడు కటకం రామకృష్ణ, నాయకులు నూర్ బాషా జానీబాబు, నాగరాజు, ఆదాం, రాఘవ యాదవ్, నరసింహారావు, కాంతారావు తదితరులు పాల్గొన్నారు.


తన కార్యాలయంలో బుక్‌లెట్‌లను ఆవిష్కరిస్తున్న కన్నా లక్ష్మీనారాయణ తదితరులు

నూతన సంవత్సరంలో అందరికీ మేలు జరగాలి

● టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బ్రహ్మారెడ్డి


బ్రహ్మారెడ్డికి కేక్ తినిపిస్తున్న టీడీపీ నేతలు

కారంపూడి, డిసెంబరు 31: నూతన సంవత్సరంలో ప్రజలందరికీ మేలు జరిగి సుఖసంతోషాలతో ఉండాలని టీడీపీ మాచర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జూలకంటి బ్రహ్మారెడ్డి ఆకాంక్షించారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఆదివారం ఆయన టీడీపీ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం కేక్‌ను కట్ చేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కుర్రి శివారెడ్డి, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త రామాంజినేయులు, మండల అధ్యక్షుడు కృష్ణబాబు, టీడీపీ మండల అధ్యక్షుడు కటికం బాలకృష్ణ, తోట నరసింహారావు, పలిశెట్టి శ్రీనివాసరావు, రాము, సురేష్ పాల్గొన్నారు.

నేడు మాచర్లలో బ్రహ్మారెడ్డి

మాచర్ల రూరల్, డిసెంబరు 31: నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకొని పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో సోమవారం ఆ పార్టీ మాచర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జూలకంటి బ్రహ్మారెడ్డి ప్రజలకు అందుబాటులో ఉండనున్నారు. ఉదయం 10:30 గంటల నుంచి నూతన సంవత్సర వేడుకలో పాల్గొననున్నారు.

పోలేరమ్మ, మహాలక్ష్మి అమ్మవారికి పూజలు

పెదకూరపాడు, డిసెంబరు 31 : మండలంలోని బుచ్చయ్యపాలెం లో పోలేరమ్మ తల్లి, మహాలక్ష్మి అమ్మవార్ల 16 రోజుల పండుగ ప్రత్యేక పూజలు భక్తి శ్రద్ధలతో ఘనంగా జరిగాయి. ఆది వారం జరిగిన పూజల్లో మాజీ ఎమ్మెల్యే కొమ్మాల పాటి శ్రీధర్, మాజీ ఎంపీపీలు బెల్లంకొండ రామ గోపాలరావు, గల్లా బాబూరావు, టీడీపీ మండల అధ్యక్షులు అర్తిమళ్ళ రమేష్, తెలుగు రైతు జిల్లా కార్యదర్శి భాష్యం అంజనేయులు, మండల టీడీపీ నేతలు నెల్లూరి మల్లిఖార్జున్, చెరుకూరి పుల్లయ్య, పరుచూరి పూర్ణచంద్రరరావు, ఎల్లలచెరు వు సురేష్ పాల్గొన్నారు. ఎ మ్మెల్యే నంబూ రు శంకరరావు సతీమణి వనం త కుమారి కూడా పూజల్లో పాల్గొన్నారు.

నూతన సంవత్సరం అందరి జీవితాల్లో సంతోషం నింపాలి

● టీడీపీ నాయకుడు శౌరయ్య


నాగోతు శౌరయ్య

నకరికల్లు, డిసెంబరు 31 : ఈ నూతన సంవత్సరం అందరి జీవితాల్లో సుఖ సంతోషాలు నింపాలని, నియోజకవర్గ టీడీపీ సీనియర్ నేత, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు నాగోతు శౌరయ్య ఆకాంక్షించారు. రాష్ట్రంలో రాక్షసపాలన పోవాలని, రామరాజ్యం రావాలని తెలుగు ప్రజలందరూ కోరుకుంటున్నారన్నారు. ప్రజలపై పన్నుల భారం పడకుండా అభివృద్ధిని కొనసాగించేలా సంక్షేమానికి సమాన ప్రాధా న్యత ఇచ్చేలా టీడీపీ, జనసేన పాలన అధికారంలోకి రానున్నదని శౌరయ్య ఆశాభావం వ్యక్తం చేశారు. 2024లో జరిగే ఎన్నికల్లో ప్రజలు టీడీపీ, జనసేనను గెలిపించేందుకు ఎదురు చూస్తున్నారు.

కాపునాడు జిల్లా అధ్యక్షుడిగా పోలిశెట్టి

అమరావతి, డిసెంబరు 31 : కాపునాడు జిల్లా అధ్యక్షుడిగా అమరావతికి చెందిన పోలిశెట్టి వెంకటసత్యనారాయణను నియమించారు. గుంటూరు అమరావతి రోడ్డులో గల అన్నదాన సత్రంలో కాపునాడు జిల్లా అధ్యక్షుడిగా వెంకటసత్యనారాయణ సోమవారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. కార్యక్రమానికి మండల పరిధి గ్రామాల నుంచి కాపు సామాజికవర్గానికి చెందిన నాయకులు తరలి వెళ్తున్నారు.

టీడీపీ, జనసేన సమన్వయంతో వైసీపీని ఇంటికి పంపుదాం

● మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి

పెదకూరపాడు, డిసెంబరు 31 : టీడీపీ, జనసేన సమన్వయంతో వైసీపీని రానున్న ఎన్నికల్లో ఇంటికి సాగనంపుదామని పెదకూరపాడు మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. గుంటూరులోని పెదకూరపాడు నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో ఆదివారం టీడీపీ, జనసేన సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ వైసీపీ రాక్షస పాలన నుంచి విముక్తి కలిగించటానికి రెండు పార్టీలు కలసి ముందుకు వెళ్తున్నాయన్నారు. వైసీపీ విముక్తితోనే రాష్ట్రానికి, ప్రజలకు మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. ఈ సమావేశంలో జనసేన నాయకులు యర్రంశెట్టి రామకృష్ణ, శాఖమూరి శ్రీనివాసరావు, శివ నాగేశ్వరరావు, వాకా అఖిల్, మల్లెల చలపతిరావు, రమాదేవి, సురేష్‌లు పాల్గొన్నారు.





మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి

రైతులకు నష్టపరిహారం చెల్లించాలి

అచ్చంపేట, డిసెంబరు 31 : తుఫాన్ కారణంగా నష్టపోయిన రైతులందరికీ పరిహారం చెల్లించాలని, ఆరు తడులకు నీరు అందించి రైతాంగాన్ని ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ కొమ్మాలపాటి శ్రీధర్ డిమాండ్ చేశా రు. అచ్చంపేటలోని టీడీపీ నాయకుడు వెనిగండ్ల కోటయ్య ఇంటి వద్ద ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర రైతాంగం అనేక కష్టనష్టాలు ఎదుర్కొంటూ అప్పుల్లో కూరుకుపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. కాటన్ కార్పొరేషన్ ద్వారా పత్తిని కొనుగోలు చేయాల్సిన ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తుందన్నారు. వైసీపీ ప్రభుత్వం దళారీ వ్యవస్థను ప్రోత్సహిస్తుందని, రైతులపై జగన్‌మోహన్ రెడ్డికి ప్రేమ లేదన్నారు. రైతులను, విద్యార్థులను దగా చేసింది జగన్‌మో హన్‌రెడ్డియేనని విమర్శించారు. అంగన్‌వాడీలతో పాటు కార్మికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఎమ్మెల్యేకు భయం పట్టుకొని గ్లోబల్ ప్రచారాలు చేస్తున్నారని విమర్శించారు. ఈ సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం, బత్తుల శ్రీనివాసరావు, వెనిగండ్ల కోటయ్య, ఎస్‌కే కాసుల, పసుపులేటి పాపిరెడ్డి, మొక్కపాటి గిరిబాబు, పొన్నెకంటి రవి, చల్లా అనూపకళ, తిరువాయిపాటి ఆంజనేయులు, రేపూడి తోమాస్ తదితరులు పాల్గొన్నారు.


వైసీపీ నుంచి టీడీపీలో చేరిక

అమరావతి, డిసెంబరు 31 : మండల పరిధిలోని జూపూడి గ్రామసర్పంచ్ పేరయ్య ఆధ్వర్యంలో నాలుగు కుటుంబాలు ఆదివారం గుంటూరులోని మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ కార్యాలయంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. సర్పంచ్ పేరయ్య కూడా కొద్దిరోజుల క్రితం కంచేటి సాయిబాబుతో పాటు టీడీపీలో చేరారు.



ఆర్యవైశ్య సంఘ పట్టణ అధ్యక్షుడిగా మద్ది

సత్తెనపల్లి, డిసెంబరు 31 : పట్టణ ఆర్యవైశ్య సంఘ నూతన అధ్యక్షుడిగా మద్ది వెంకటేశ్వరరావు వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థాన కళ్యాణ మండపంలో జరిగిన సమావేశంలో నూతన అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పట్టణంలో ఆర్యవైశ్య సంఘ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.











నూతన సంవత్సర వేడుకలకు రెడీ











సత్తెనపల్లి, డిసెంబరు 31 : నూతన సంవత్సరం 2024లోకి అడుగు పెడుతున్న దృష్ట్యా పట్టణంలోని ప్రజల్లో ఉత్సాహం పెరిగింది. న్యూ ఇయర్ వేడుకలకు ఫుడ్ వ్యాపారులకు డిమాండ్ పెరిగింది. రెస్టారెంట్‌లు, బిర్యానీ పాయింట్‌లు నిర్వహించే వ్యాపారులు ప్రత్యేక ఆఫర్లను ప్రకటించారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో ప్రత్యేకంగా టెంట్లు వేసి కేక్‌లను విక్రయించారు. బేకరీల్లో కూడా జోరుగా కేకుల అమ్మకాలు జరిగాయి. అర కేజీ నుంచి ఐదు కేజీల వరకు కేక్‌లు అమ్మారు. వీటికి ప్రత్యేక ఆఫర్లు ఇచ్చారు. భోజనప్రియులకు రుచికరమైన ఆహార పదార్థాల ఆఫర్లను కూడా రెస్టారెంట్


సత్తెనపల్లిలో ఏర్పాటు చేసిన కేక్‌లు, పండ్ల దుకాణాలు

నిర్వాహకులు ప్రకటించారు. కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతూ రంగులు వేసేందుకు మహిళలు రంగులు కొనుగోలు చేశారు. అన్ని పార్టీలు కూడా నూతన సంవత్సర వేడుకలు నిర్వహించేందుకు సిద్ధమయ్యాయి. పట్టణంలోని అన్ని చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి న్యూ ఇయర్ కేక్‌ను కట్ చేసి ఒకరికొకరు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో యువత కేక్‌లు కట్ చేసుకుని నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకున్నారు. నూతన సంవత్సరం రోజున సోమవారం ఆలయాలను సందర్శించే భక్తుల కోసం ఆలయ నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. పట్టణంలోని 20వ వార్డులో టీడీపీ బీసీ సెల్ నేత మారెళ్ల స్వామి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నూతన సంవత్సర వేడుకల్లో కన్నా లక్ష్మీనారాయణ పాల్గొని కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంపిణీ చేశారు. పట్టణంలో, లక్కరాజుగార్లపాడు గ్రామంలోని పలు చర్చిల్లో జరిగిన నూతన సంవత్సర వేడుకల్లో ప్రత్యేక ప్రార్థనలలో కన్నా పాల్గొని ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

పారిశుధ్య కార్మికుల నిరసన

పిడుగురాళ్ల, డిసెంబరు 31 : పారిశుధ్య కార్మికుల సమస్యను పరిష్కరించాలని కోరుతూ కార్మికులు పిడుగురాళ్లలో నిరవధిక సమ్మెను కొనసాగిస్తున్నారు. సమ్మెలో భాగంగా ఆదివారం పారిశుధ్య కార్మికులు, సీఐటీయూ నాయకులు కళ్లకు నల్ల రిబ్బన్లు ధరించి నిరసన తెలిపారు. ప్రైవేటు వ్యక్తులను పారిశుధ్య విధుల్లోకి తీసుకోవటాన్ని నిరసిస్తూ కొత్త వ్యక్తులు పనుల్లోకి రాకుండా అడ్డగించటంతో పాటు మా పొట్ట కొట్టవద్దు అంటూ విజ్ఞప్తి చేశారు.

అంగన్‌వాడీ కేంద్రాల వద్ద ఆట పాట

అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గత ఇరవై రోజులుగా పిడుగురాళ్ల అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు ఆదివారం అంగన్‌వాడీ కేంద్రాల వద్ద విద్యార్థులతో ఆటపాట నిర్వహించి నిరసన తెలిపారు.

● దాచేపల్లి, డిసెంబరు 31 : గత ఆరు రోజులుగా ప్రభుత్వ తీరును ఎండ గడుతూ నగర పంచాయతీలోని పారిశుధ్య సిబ్బంది చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారానికి ఆరవ రోజుకు చేరుకున్నాయి. ప్రభుత్వం పారిశుధ్య సిబ్బంది సమస్యపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని వారు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.

జనసేన ర్యాలీని అడ్డుకున్న పోలీసులు

సత్తెనపల్లి, డిసెంబరు 31 : పట్టణంలోని చెక్ పోస్టు సెంటర్‌లో జనసేన ర్యాలీని పోలీసులు అడ్డుకున్న సంఘటన ఆదివారం రాత్రి జరిగింది. సత్తెనపల్లిలో జనసేన కార్యాలయం ప్రారంభం, పార్టీ జెండా ఆవిష్కరణకు దూళిపాళ్ల నుంచి జన సైనికులు ర్యాలీగా సత్తెనపల్లికి వస్తుండగా పట్టణంలోని చెక్‌పోస్టు సెంటరులో అదే సమయంలో వైసీపీ ర్యాలీ కూడా వచ్చింది. ఈ సందర్భంగా పోలీసులు జనసేన ర్యాలీని అడ్డుకున్నారు. దీంతో జన సైనికులు రోడ్డుపై బైఠాయించి మంత్రి అంబటి రాంబాబుకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. జన సైనికుల బైఠాయింపుతో కొద్దిసేపు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. వైసీపీ ర్యాలీ వెళ్లిన అనంతరం జన సైనికుల ర్యాలీకి పోలీసులు అనుమతించారు. అనంతరం జనసేన నియోజకవర్గ సమన్వయ కర్త బొర్రా వెంకట అప్పారావు గుంటూరు రోడ్డులో ఏర్పాటు చేసిన జనసేన పార్టీ కార్యాలయాన్ని, పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జనసేన నేతలు కొమ్మిశెట్టి సాంబశివరావు, రంగిశెట్టి సుమన్, నాదెండ్ల, నాగేశ్వరరావు, తోట నరసయ్య, తాడువాయి లక్ష్మి, చిలకా సత్యం, పూర్ణ పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ కృష్ణారెడ్డి మృతి

రెంటచింతల, డిసెంబరు 31 : మండలంలోని గొట్టిముక్కల గ్రామ మాజీ సర్పంచ్ ఉమ్మా కృష్ణారెడ్డి (74) ఆదివారం మృతి చెందారు. 1987 నుంచి 1992 వరకు గ్రామానికి సర్పంచ్‌గా వ్యవహరించారు. కృష్ణారెడ్డి భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించిన వారిలో జిల్లా జేఏసీ కన్వీనర్ మోర్తల ఉమ, మాజీ జడ్పీటీసీ ఎస్.భాస్కర రెడ్డి, జడ్పీ వైస్ చైర్మన్ శౌరిరెడ్డి నర్సిరెడ్డి, పమ్మి సీతయ్య, వైసీపీ మండల మాజీ కన్వీనర్ పూజల రామయ్య, వాసవీ ఆలయ చైర్మన్ కట్టమూరి నాగేశ్వరరావు, గుండా కిషోర్ ఉన్నారు.



















పల్నాడు వార్తలు

• నరసరావుపేట • వినుకొండ • చిలకలూరిపేట

రంగంలోకి పోటీ కార్మికులు

- పురపాలక సంఘం చర్యలపై కార్మికుల మండిపాటు
- మున్సిపల్ అతిథిగృహం గేట్లుమూసి అధికారులను అడ్డుకున్న కార్మికులు
- వాటర్ ట్యాంక్ ఎక్కి కార్మికుల నిరసన



అధికారుల వాహనాలను అడ్డుకుంటున్న మున్సిపల్ కార్మికులు



వాటర్ ట్యాంక్ ఎక్కి నిరసన తెలియజేస్తున్న కార్మికులు

నరసరావుపేట టౌన్, డిసెంబరు 31: మున్సిపల్ కార్మికులు నిరవధిక సమ్మెలో భాగంగా ఆరోరోజు ఆందోళన నిర్వహించారు. దీంతో మున్సిపల్ అధికారులు ఇంజనీరింగ్ విభాగంలో పనిచేస్తున్న కార్మికులను వందమందిని ఆదివారం రంగంలోకి దించారు. దీంతో మున్సిపల్ కార్మికులు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఉన్న మున్సిపల్ కార్మికులతో పనిచేయించుకుంటే అభ్యంతరం లేదని, పోటీ కార్మికులను పనిలోకి తీసుకుంటే ఊరుకునేది లేదని మున్సిపల్ కార్మికులు హెచ్చరించారు. కార్మికులు డిమాండ్ చేస్తున్నప్పటికి పట్టించుకోకుండా మున్సిపల్ కమిషనర్ బయటకు వెళ్ళేందుకు కారు ఎక్కడంతో కార్మికులు కారుకు అడ్డుపడి గేట్లు మూసివేశారు. పలువురు కార్మికులు వాటర్ ట్యాంక్‌పైకి ఎక్కి నిరసన తెలియజేశారు. పోటీ కార్మికులను పనిలోకి దించమని స్పష్టమైన హామీ ఇస్తేనే ట్యాంక్ పైనుంచి కిందకి దిగుతామని డిమాండ్ చేశారు. కార్మికులకు సంఘీభావంగా టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు మున్సిపల్ అతిథిగృహం వద్దకు చేరుకొని మున్సిపల్ కార్మికులకు మద్దతుగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ నిద్రాహారాలుమాని కార్మికులు రోడ్లపై ఆందోళనలు చేస్తూ ఆకలి కేకలు పెడుతుంటే ప్రభుత్వానికి పట్టాదా అని ప్రశ్నించారు. తక్షణమే కమిషనర్ వచ్చి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మున్సిపాలిటీకి కోట్లలో వస్తున్న ఆదాయం మొత్తం ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి జేబులోకి చేరడం వల్లనే కార్మికులకు జీతాలివ్వలేని దుస్థితి నెలకొందని మండిపడ్డారు. ప్రజాస్వామ్యబద్ధంగా తమ హక్కుల కోసం పోరాడే వారిని పోలీసులు అడ్డుకోవడంపై అసహనం వ్యక్తం చేశారు. భరోసా ఇవ్వాల్సిన అధికారులు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తారా అని నిలదీశారు. ఆరోగ్యం బాగా లేకున్నా ఉద్యమాలు చేస్తున్న వారిపై పోలీసులను ప్రయోగించడం దుర్మార్గమని ధ్వజమెత్తారు. ఏఐటీయూసీ కార్మికులు సీఐటీయూ కార్మికులకు అండగా నిలిచి విధులు బహిష్కరిస్తామన్నారు. పోటీ కార్మికులను రంగంలోకి దింతే సహించేది లేదని కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.



మున్సిపల్ కార్మికులకు మద్దతుగా అధికారులతో మాట్లాడుతున్న టీడీపీ నేత డాక్టర్ చదలవాడ అరవిందబాబు తదితరులు

మోకాళ్లపై ఎస్ఎస్ఏ ఉద్యోగుల నిరసన

- ప్రభుత్వం దిగివచ్చే వరకు పోరాటం కొనసాగిస్తామని హెచ్చరిక

నరసరావుపేట టౌన్, డిసెంబరు 31: ప్రభుత్వానికి అనేకసార్లు విన్నవించినా పట్టించుకోకపోవడంతో అనివార్య పరిస్థితులలోనే నిరవధిక సమ్మెకు దిగామని ఎస్ఎస్ఏ ఉద్యోగులు అన్నారు. ఆదివారం సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు 12వ రోజు నిరవధిక సమ్మెలో భాగంగా పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలో మోకాళ్లపై అర్ధనగ్నంగా నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎస్ఏ ఉద్యోగులు మాట్లాడుతూ 20ఏళ్ల నుంచి వెట్టిచాకిరి చేస్తున్నా చాలీచాలని వేతనాలతో విధులు నిర్వహిస్తున్నామని అన్నారు. తమ సేవలు కీలకమని, తక్షణమే తమ సమస్యలు పరిష్కరించాలన్నారు, సమగ్రశిక్ష ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, సమాన పనికి సమాన వేతనం, గ్రాట్యుటీ, ఇతర న్యాయమైన డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. హెచ్ఆర్ పాలసీ, సమాన పనికి సమాన వేతనం అమలుచేసే వరకు పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. ఎన్నికల హామీ అమలు చేయకుండా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మోసం చేశారన్నారు. తక్కువ వేతనాలు అయినప్పటికి ఎప్పటికైనా క్రమబద్ధీకరిస్తారని అన్న ఆశతో విధులు 20 ఏళ్లుగా నిర్వహిస్తున్నామని చెప్పారు. విద్యా వ్యవస్థలో అత్యంత కీలకపాత్ర వహిస్తున్న ఉద్యోగులపై రాష్ట్ర ప్రభుత్వం మొండివైఖరి విడనాడాలని డిమాండ్ చేశారు.

గ్రంథాలయాల్లో అందుబాటులో గ్రూప్-1, గ్రూప్-2 పుస్తకాలు

శావల్యాపురం, డిసెంబరు 31: గ్రూప్-1, గ్రూప్-2 పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు శావల్యాపురం సెంటర్‌లోని శాఖా గ్రంథాలయంలో అన్ని పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని ఇన్‌చార్జి గ్రంథాలయాధికారి గంగవరపు అర్జున్ శుక్రవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ గుంటూరు జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థ పర్సన్ ఇన్‌చార్జి, జాయింట్ కలెక్టర్ రాజాకుమారి గనియా, కార్యదర్శి ఝాన్సీలక్ష్మీల చేతుల మీదుగా శావల్యాపురం శాఖా గ్రంథాలయానికి గ్రూప్-1, గ్రూప్-2 పుస్తకాలను అందజేయడం జరిగిందన్నారు. మండలంలో గ్రూప్-1, గ్రూప్-2 పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


నూతన సంవత్సర మరియు
సంక్రాంతి శుభాకాంక్షలు
2024
HAPPY NEW YEAR
తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రివర్యులు,
స్వర్ణాంధ్ర రథసారథి మా ప్రియతమ నాయకులు,
గౌ॥ మాన్యశ్రీ నారా చంద్రబాబు నాయుడు గారికి,
తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి శ్రీ నారా లోకేష్ గారికి
తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు శ్రీ కింజరాపు అచ్చెన్నాయుడు గారికి.
జనసేన పార్టీ అధ్యక్షులు శ్రీ కొణిదెల పవన్ కళ్యాణ్ గారికి,
సత్తెనపల్లి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జ్ శ్రీ కన్నా లక్ష్మీనారాయణ గారికి.
నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులకు, కార్యకర్తలకు,
అభిమానులకు, నియోజకవర్గ ప్రజలందరికీ నా హృదయపూర్వక
నూతన సంవత్సర మరియు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేస్తూ...
సదా మీ సేవలో
నాగోతు శౌరయ్య
సత్తెనపల్లి నియోజకవర్గ
తెలుగుదేశం పార్టీ నాయకులు
T.D.P

నూతన సంవత్సర శుభాకాంక్షలు

● పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవీ

వినుకొండ, డిసెంబరు 31: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని పల్నాడు జిల్లా ప్రజలకు పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. 2024 నూతన సంవత్సరంలో రైతుల ఇంట పంటలతో కళకళలాడాలన్నారు. ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నూతన సంవత్సర వేడుకలను ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.



దిష్టిబొమ్మల దహనం తగదు

● జీవీ ఆంజనేయులు

వినుకొండ, డిసెంబరు 31: సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావుపై స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, తన అనుచరులు చేస్తున్న వ్యాఖ్యలతో పాటు దిష్టిబొమ్మను దహనం చేయడం రాజకీయాల్లో సరైన విధానం కాదని పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలకు వినతిపత్రం ఇచ్చేందుకు ఇంటివద్దకు వస్తే పోలీసులతో అడ్డుకొని, అంగన్‌వాడీలు, కార్మికసంఘ నాయకులతో దురుసుగా ప్రవర్తించి దుర్భాషలాడి ఘర్షణ వాతావరణం సృష్టించిన ఎమ్మెల్యే బొల్లా తీరును ఖండించారు. అనుచరులతో దిష్టిబొమ్మను దహనం చేయించడం ఎమ్మెల్యేకు తగదని, న్యాయమైన పోరాటాలకు మద్దతిస్తే అధికారాన్ని అడ్డంపెట్టుకొని ఎమ్మెల్యే బొల్లా చేస్తున్న దౌర్జన్యం అప్రజాస్వామికమన్నారు. వినుకొండలో ఎమ్మెల్యే వ్యవహరిస్తున్న తీరును ప్రజాస్వామికవాదులు అందరూ ఖండించాలన్నారు.

అంగన్‌వాడీలపై ప్రభుత్వానికి కనికరం లేదు

ఎస్టీయూ నాయకులు

వినుకొండటౌన్, డిసెంబరు 31: అంగన్‌వాడీల సమ్మె సందర్భంగా కార్యకర్తలు కర్నూలు-గుంటూరు జాతీయ రహదారిపై ఆదివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్టీయూ పల్నాడు జిల్లా ప్రధానకార్యదర్శి చంద్రజిత్‌యాదవ్, రామకోటయ్య సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు ఇళ్ల వాకిలి, కుటుంబాలను వదిలి 20 రోజులుగా సమ్మె చేస్తుంటే ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలు రోడ్డుపై కుర్చీలాటతో నిరసన వ్యక్తం చేశారు.



జాతీయ రహదారిపై కుర్చీలాటతో నిరసన తెలియజేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

అంగన్‌వాడీలకు నల్లమడ రైతు సంఘం మద్దతు

చిలకలూరిపేట, డిసెంబరు 31: గత 20 రోజులుగా ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీలకు నల్లమడ రైతు సంఘం అధ్యక్షుడు డాక్టర్ కొల్లా రాజ మోహనరావు ఆదివారం మద్దతు ప్రకటించారు. పట్టణంలోని గ్రంథాలయం వద్ద దీక్షా శిబిరాన్ని ఆయన సందర్శించి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ అంగన్‌వాడీల సమస్యలపై స్పందించక పోవటం దారుణమన్నారు. అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్ల సాధనకు తామంతా అండగా ఉంటామని, ప్రభుత్వ మొండివైఖరిని ఖండిస్తున్నామని చెప్పారు. సీఐటీయూ మండల కన్వీనర్ పేరుబోయిన వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌కు అంగన్‌వాడీల సమస్యలను పట్టించుకోకపోవటం అన్యాయమన్నారు. బలవంతంగా అంగన్‌వాడీ కేంద్రాల తాళాలను పగలగొట్టడం, అంగన్‌వాడీ అధికారుల ద్వారా మహిళలను బెదిరించే కార్యక్రమాలను చేయటాన్ని ఆయన ఖండించారు. అప్పులుచేసి అంగన్‌వాడీ కేంద్రాలను అంగన్‌వాడీలు నడుపుతున్నారని, ఇది ఎంతవరకు న్యాయమో ప్రభుత్వం ఆలోచించాలన్నారు. శిబిరం వద్దకు వచ్చి మద్దతు పలికిన వారిలో కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ ఎం.రాధాకృష్ణ, కేవీపీఎస్ నాయకులు జీ నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.



అంగన్‌వాడీల దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న నల్లమడ రైతు సంఘం అధ్యక్షుడు డాక్టర్ కొల్లా రాజ మోహనరావు

టీడీపీ, వైసీపీ వర్గీయుల పరస్పర దాడులు

పది మందికి తీవ్ర గాయాలు

బొల్లాపల్లి, డిసెంబరు 31: మండలంలోని పలుకూరు గ్రామంలో ఒకే సామాజిక వర్గంలోని టీడీపీ, వైసీపీ వర్గీయుల మధ్య ఆదివారం సాయంత్రం పరస్పర దాడుల్లో పలువురు గాయపడ్డారు. స్థానికుల నుంచి సేకరించిన వివరాల ప్రకారం శనివారం సాయంత్రం గ్రామంలో ఓ ఫంక్షన్ జరిగింది. ఆ సమయంలో ఒక వ్యక్తి ఒకరి ఇంటి ముందు మూత్రవిసర్జన చేశాడు. ఆ ఇంటివారు అతన్ని ప్రశ్నించటంతో వాగ్వివాదం జరిగింది. అనంతరం ఆ వివాదం సద్దుమణిగింది. ఉదయం సమయంలో ఈ విషయమై మరలా ఉదయం పూట పరస్పరం దూషించుకున్నారు. ఈ విషయమై చిలవలు పలువలుగా ఇరువర్గాల తెలిసి మరలా వాగ్వివాదం చెలరేగింది. ఇది ఆదివారం సాయంత్రం సమయానికి ఇరువర్గాల మధ్య ఘర్షణకు దారితీసింది. సమయంలో టీడీపీ, వైసీపీ వర్గాలుగా ఏర్పడి రాళ్ళు, కర్రలతో పరస్పరం దాడులు చేసుకోగా ఈ దాడుల్లో ఇరు పార్టీలకు చెందిన సుమారు పది మందికి తీవ్ర గాయాలయ్యాయి. గాయాలైన వారిని 108 అంబులెన్స్ వినుకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. దాడుల విషయం తెలుసుకున్న బొల్లాపల్లి ఎస్ఐ చెన్నకేశవులు తన సిబ్బంది గ్రామంలో బందోబస్తు నిర్వహించారు. కొత్త వ్యక్తులను గ్రామంలోని రానివ్వకుండా చర్యలు తీసుకుంటున్నారు. ఇరు పార్టీల వ్యక్తులపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గ్రామంలో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. పలువురు గ్రామస్థులు గ్రామం వదిలి భయంతో వేరే ప్రాంతాలకు తరలివెళ్లారు.

ఎమ్మెల్యే బొల్లా దిష్టిబొమ్మ దహనం

వినుకొండ, డిసెంబరు 31: అంగన్‌వాడీ కార్యకర్తలకు సంఘీభావం తెలిపేందుకు వచ్చిన వామపక్ష పార్టీలకు చెందిన సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు హనుమంతరెడ్డితో పాటు సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావులను దుర్భాషలాడటం ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడుకు తగదని సీపీఐ నాయకులు ఆదివారం ఆగ్రహం వ్యక్తం చేశారు. బొల్లా బ్రహ్మనాయుడు దిష్టిబొమ్మను శివయ్యస్థూపం సెంటర్‌లో ఆ పార్టీ నాయకులు దహనం చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ఎమ్మెల్యే వాస్తవాలను మరచి వామపక్షపార్టీ నాయకులను ఇష్టం వచ్చినట్లు దుర్భాషలాడటంను ఈ సందర్భంగా ఖండించారు. కార్యక్రమంలో బూదాల శ్రీనివాసరావు, ఉలవలపూడి రాము, సాగర్‌బాబు, పిన్నిబోయిన వెంకటేశ్వర్లు, పవన్‌కుమార్, రామారావు, మార్కు, శశికుమార్, అఖిల్ బాబు, వెంకటేశ్వర్లు, మస్తాన్, మల్లికార్జునరావు, నలబోతుల శ్రీను, నాగమల్లేశ్వరరావు, సోడాల సాంబయ్య, జెల్లి వెంకటేశ్వర్లు, శ్రీను, కృపారావు, దానయ్య తదితరులు పాల్గొన్నారు.



శివయ్యస్థూపం సెంటర్‌లో ఎమ్మెల్యే బొల్లా దిష్టిబొమ్మను దహనం చేస్తున్న సీపీఐ నాయకులు

ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించటమే ప్రభుత్వ లక్ష్యం

● ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి



కొత్తపల్లిలో సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

రొంపిచర్ల, డిసెంబరు 31: ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికీ అందించటమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని కొత్తపల్లిలో రూ.43లక్షల వ్యయంతో నిర్మించిన సచివాలయం, రూ.21 లక్షలతో నిర్మించిన వైఎస్ఆర్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లను శనివారం రాత్రి ప్రారంభించారు. రూ.1.22 కోట్లతో జల జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికి తాగునీటి పథకం పనులకు శంకుస్థాపన చేశారు. రూ.50లక్షల వ్యయంతో నిర్మించిన మురుగు కాలువల నిర్మాణాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో రూ.15 కోట్లమేర వివిధ అభివృద్ధి పనులు జరిగాయన్నారు. పార్టీలకు అతీతంగా ప్రభుత్వ పథకాలు అందిస్తున్నట్టు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం గడిచిన నాలుగున్నర సంవత్సరాల్లో మేనిఫెస్టోలో ఉన్న వాగ్దానాలను అధికశాతం నెరవేర్చిందన్నారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు, ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా పట్టాభిరామస్వామి ఊరేగింపు

నరసరావుపేట, డిసెంబరు 31: స్థానిక పట్టాభి రామస్వామి వారి దేవాలయంలో ధనుర్మాసం పురష్కరించుకొని ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. పట్టాభి రామస్వామి వారిని వెండి ఉయ్యాలలో ఆలయ ప్రదక్షిణ, నగరోత్సవం వైభవంగా జరిపారు. ఆలయ ధర్మకర్త, మునిసిపల్ మాజీ చైర్మన్ నాగసరపు సుబ్బరాయ గుప్తా, అనూరాధ దంపతులు, రూపేష్‌గుప్తా, రామదేవ్ గుప్తా దంపతులు, భక్తులు పాల్గొన్నారు. పట్టాభి రామ స్వామి వారి కీర్తనలు అలపించారు.



పట్టాభిరామస్వామి ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

మహంకాళి ఆలయ పునఃనిర్మాణానికి విరాళం

నరసరావుపేట రూరల్, డిసెంబరు 31: మండలంలోని ఇసప్పాలెంలోని మహంకాళి అమ్మవారి ఆలయం పునఃనిర్మాణం కోసం నరసరావుపేటకు చెందిన ముత్య గురునాథ వెంకటశివకోటిరెడ్డి, సుధాదేవి దంపతులు రూ.1,00,116/- విలువైన చెక్కును ఆలయ కార్యనిర్వహణ అధికారి టి.సుధాకరరెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా టి.సుధాకరరెడ్డి మాట్లాడుతూ మహంకాళి అమ్మవారి ఆలయ పునఃనిర్మాణ పనులు ప్రారంభమయ్యాయని భక్తులు విరివిగా విరాళాలు అందజేయాలని కోరారు. విరాళాలు ఇచ్చే దాతలకు ఆదాయపుపన్ను సెక్షన్ 80జి కింద పన్ను మినహాయింపు వర్తిస్తుందని తెలిపారు. ఆలయంలో ఆదివారం నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో దాతలు ముత్య గురునాథ వెంకట శివకోటిరెడ్డి, సుధాదేవి దంపతులు పాల్గొన్నారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి టి.సుధాకరరెడ్డి, అర్చకులు అమ్మవారి తీర్థప్రసాదాలను దాతలకు అందజేశారు.

రొంపిచర్ల సర్పంచ్ మృతి

రొంపిచర్ల, డిసెంబరు 31: మండల కేంద్రమైన రొంపిచర్ల సర్పంచ్ కొమ్ము నాగేశ్వరరావు ఆదివారం అర్థరాత్రి గుండెపోటుతో మృతి చెందినట్టు బంధువులు తెలిపారు. కొద్ది నెలల క్రితం ఆయన సర్పంచ్‌గా పదవీ బాధ్యతలు చేపట్టారు. ప్రమాదవశాత్తూ విద్యుత్ స్తంభంపై నుంచి కిందపడటంతో తలకు గాయమైంది. అనంతరం ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స తీసుకొని ఇంటివద్ద ఉంటున్నాడు. హఠాత్తుగా గుండెపోటు రావటంతో ఆయన మృతిచెందాడు. నాగేశ్వరరావు మృతికి గ్రామ వైసీపీ నాయకులు సంతాపం తెలిపారు. నాగేశ్వరరావు మృత దేహాన్ని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి సందర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.



కొమ్ము నాగేశ్వరరావు (ఫైల్ ఫొటో)






















నూతన సంవత్సరంలో ప్రజలు సంతోషంగా ఉండాలి: మాజీ మంత్రి ప్రత్తిపాటి

చిలకలూరిపేట అర్బన్, డిసెంబరు 31 : నియోజక వర్గ ప్రజలకు మాజీ మంత్రి, రాష్ట్ర టీడీపీ ఉపాధ్యక్షుడు ఆదివారం నూతన సంవత్సర శుభాకాంలు తెలిపారు. ఈ నూతన సంవత్సరంలో ప్రజలు సుఖ శాంతులతో, ఆయు రారోగ్యాలతో బాగుండాలని, అలాగే రైతులు పాండి పంటలతో సమృద్ధిగా సంతోషంగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ప్రజల సంతోషం కోసమే టీడీపీ ఎల్లప్పుడూ కృషి చేస్తుందన్నారు.







నూతన సంవత్సరం అందరి జీవితాల్లో సంతోషం నింపాలి

● సత్తెనపల్లి నియోజక వర్గ టీడీపీ నాయకులు నాగోతు శౌరయ్య



నకరికల్లు, డిసెంబరు 31: ఈ నూతన సంవత్సరం అందరి జీవితాల్లో సుఖసంతోషాలు నింపాలని, సత్తెన పల్లి నియోజకవర్గ టీడీపీ సీనియర్ నేత, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు నాగోతు శౌరయ్య ఆకాంక్షించారు. రాష్ట్రంలో రాక్షసపాలన పోవాలని, రామరాజ్యం రావాలని తెలుగు ప్రజలందరూ కోరుకుంటున్నారన్నారు. అధికార మార్పుకు ప్రజలు సంసిద్ధంగా ఉన్నారన్నారు. ప్రజలపై పన్నుల భారం పడ కుండా అభివృద్ధిని కొనసాగించేలా సంక్షేమానికి సమాన ప్రాధాన్యం ఇచ్చేలా టీడీపీ, జనసేనపాలన అధికారంలోకి రానున్నదని శౌరయ్య ఆశాభావం వ్యక్తం చేశారు. పోలవరం పూర్తి, రాజధాని నిర్మాణం, నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, మహిళల ఆర్థికాభివృద్ధి, సమానత్వం, వ్యవసాయాన్ని రైతులు ఆదాయం పొందేలా ప్రభుత్వ ప్రోత్సాహకాలు జనసేన, టీడీపీ సంకీర్ణ ప్రభుత్వంతోనే సాధ్యమని ప్రజలు భావిస్తున్నారన్నారు. 2024లో జరిగే సాధారణ ఎన్నికల్లో ప్రజలు టీడీపీ, జనసేనను గెలిపించేందుకు ఎదురు చూస్తున్నారు.


జాన్‌సైదులు దంపతులను సత్కరిస్తున్న జేసీ శ్యాంప్రసాద్

తహసీల్దార్ జాన్‌సైదులు సేవలు అభినందనీయం

● జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్

శావల్యాపురం, డిసెంబరు 31: రెవెన్యూ శాఖలో 39ఏళ్లపాటు వివిధ హోదాలలో ఉద్యోగ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి ప్రజలందరి మన్ననలు పొందిన తహసీల్దార్ షేక్ జాన్‌సైదులు సేవలు అభినందనీయ మని జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్, మండల ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్‌గా బాధ్యతలు నిర్వహించిన షేక్ జాన్‌సైదులు స్వచ్ఛంద ఉద్యోగ విరమణ సందర్భంగా ఆదివారం ఘనంగా సత్కరించారు. ముఖ్యఅతిథులుగా జేసీ శ్యాంప్రసాద్, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు పాల్గొని తహసీల్దార్ జాన్‌సైదులు, నజీమున్ దంపతులను దుశ్శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. మాజీ ఎమ్మెల్యే మక్కెన మాట్లాడుతూ తహసీల్దార్ జాన్‌సైదులు ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ వారికి ఎనలేని సేవలందించారని, తోటి ఉద్యోగులకు ఆదర్శంగా ఉంటూ ఉన్నతాధికారుల మన్ననలు పొందారని కొనియాడారు. కార్యక్రమంలో ఈపూరు మార్కెట్ యార్డు ఛైర్మన్ చుండూరి వెంకటేశ్వర్లు, ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని అనిల్‌కుమార్, సొసైటీ ఛైర్మన్‌లు నాగులపాటి చెన్నయ్య, బొల్లా శివ, వైసీపీ మండల కన్వీనర్ భీమని అంకారావు, సీనియర్ నేతలు కావూరి మాబుసుభానయ్య, తేలప్రోలు రాఘవేంద్రరావు, స్వర్ణాల వెంకటరావు, పూరేటి నాగేశ్వరరావు, ఎంపీడీవో పేరుమీన సీతారామయ్య, తహసీల్దార్‌లు పుల్లారావు, నాగమల్లేశ్వరరావు, డీటీ నాసరయ్య వీఆర్వోలు, విలేజ్ సర్వేయర్‌లు, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.


అవార్డును అందుకుంటున్న ఖజ్జాయం విజయలక్ష్మి

వాస్లవి క్లబ్ ఉత్తమ గవర్నర్‌గా ఖజ్జాయం విజయలక్ష్మి

వినుకొండటౌన్, డిసెంబరు 31: విజయవాడలో జరిగిన వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ అవార్డుల కార్యక్రమంలో వినుకొండ పట్టణానికి చెందిన ఖజ్జాయం విజయలక్ష్మి ఉత్తమ గవర్నర్ అవార్డు అందుకున్నారు. వాసవి క్లబ్ నాయకుల చేతుల మీదుగా ఆమె అవార్డును అందుకొని వారికి కృతజ్ఞతలు తెలిపారు. అవార్డు సాధించిన విజయలక్ష్మిని వినుకొండ పట్టణానికి చెందిన పలువురు అభినందించారు.

అక్రమ మద్యం కేసులో నిందితుడి అరెస్టు

నరసరావుపేట లీగల్, డిసెంబరు 31: నాలుగు సీసాల అక్రమ మద్యం కలిగి ఉన్న కేసులో నిందితుడైన నాదెండ్ల మండలం కనపర్రు గ్రామానికి చెందిన సయ్యద్ చాంద్‌బాషాను ఆదివారం సాయంత్రం అరెస్టు చేసినట్టు నరసరావుపేట స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఎస్‌ఐ సీహెచ్ సురేంద్రబాబు తెలిపారు. తనిఖీలు నిర్వహిస్తుండగా నిం దితుడు కనపర్రు గ్రామంలోని పాఠశాల సమీపంలో అక్రమం గా నాలుగు మద్యం సీసాలను కలిగి ఉన్నాడన్నారు. మద్యం సీసాలతో పాటు ఒక మోటారు సైకిల్‌ను కూడా స్వాధీనం చేసుకున్నట్టు ఆయన తెలిపారు. నిందితుడిని కోర్టులో ప్రవేశపెట్టనున్నట్టు తెలిపారు.

నూతన సంవత్సర వేడుకలకు ఏర్పాట్లు

చిలకలూరిపేట, డిసెంబరు 31: నూతన సంవత్సరం సందర్భంగా పట్టణంలోని వివిధ రాజకీయ పార్టీల నాయకుల గృహాల వద్ద, పార్టీ కార్యాలయాల వద్ద ఆదివారం రాత్రి సందడి నెలకుంది. పట్టణంలోని పండరీపురంలో ఉన్న మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావు గృహానికి దారితీసే వీధిలో, లక్ష్మీపురంలోని శాసన మండలి సభ్యులు మర్రి రాజశేఖర్ నివసించే వీధిలో రంగు రంగుల దీపాలు, ఫెక్సీలతో నిండిపోయింది. పాత పశువుల సంత వద్ద వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త మల్లెల రాజేష్ నాయుడు ఆధ్వర్యంలో భారీ ఎత్తున ఏర్పాట్లు జరిగాయి. పెద్ద పెద్ద టెంట్లు వేసి ప్రాంగణాన్ని అందంగా అలంకరించారు. కృష్ణనగర్‌లో నివాసం ఉంటున్న అద్దంకి శాసన సభ్యుడు గొట్టిపాటి రవి కుమార్ నివాస గృహం వద్ద సందడి నెలకున్నది. ఆయన గృహానికి సమీపంలో, ఆ వీధిలో భారీ ఎత్తున ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. పట్టణంలోని పలు ప్రధాన వీధులు, సెంటర్లలో ఆయా పార్టీల నాయకులకు స్వాగతం పలుకుతూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు.

పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంలపై అవగాహన కార్యక్రమాలు



చిలకలూరిపేట, డిసెంబరు 31: పట్టణంలోని పలు పోలింగ్ కేంద్రాల్లో ఆదివారం మునిసిపల్ కమిషనర్ గోవిందరావు ఆధ్వర్యంలో ఈవీఎంలు, వీవీ ప్యాట్స్‌లపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. హాజరైన ఓటర్లకు ఈవీఎంలను ప్రదర్శించి కంట్రోల్ యూనిట్, బ్యాలెట్ యూనిట్, వీవీ ప్యాట్‌లు పని చేసే విధానం పై అవగాహన కల్పించారు. స్వయంగా ఓటువేసి అనుమానాలను నివృత్తి చేసుకొనేందుకు డెమో ఈవీఎంలను ఏర్పాటు చేశారు. ఓటర్లు ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంలను పరిశీలించ వచ్చునని పేర్కొన్నారు. ఆయన వెంట టీపీవో కే సునీత, ఆర్‌వో దావూద్, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల సమ్మెపై సన్నాహక సమావేశం

చిలకలూరిపేట, డిసెంబరు 31: జనవరి 3వ తేదీ నుంచి స్థానిక మునిసిపల్ కార్మికుల సమ్మె నేపథ్యంలో ఏఐటీయూసీ మునిసిపల్ వర్కర్ల సంఘం చిలకలూరిపేట శాఖ ఆధ్వర్యంలో ఆదివారం సమ్మె సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ ఏరియా కార్యదర్శి నాగభైరు రామసుబ్బాయమ్మ మాట్లాడుతూ పారిశుధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించటానికి ప్రభుత్వం ముందుకు రావటం లేదన్నారు. ఎప్పటికప్పుడు కార్మికుల సమస్యలను పరిష్కరించకుండా వాయిదాలు వేయటం సహించరాని విషయం అని పేర్కొన్నారు. అండర్‌గ్రౌండ్ డ్రైయినేజ్ వర్కర్లు విధి నిర్వాహణలో మరణిస్తే రూ.30 లక్షలు, ప్రమాదం జరిగి గాయపడితే రూ.10 లక్షలు చెల్లించాలని డిమాండ్ చేశారు. పారిశుధ్య కార్మికుల సమ్మెకు వివిధ ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలు మద్దతు తెలపాలని కోరారు.

సమావేశంలో వివిధ సంఘాలకు ఎందిన కే చెంచయ్య, యోగయ్య, పేలూరి రామారావు, దాసరి వరహాలు, షేక్ సుభానీ, చెరుకుపల్లి నిర్మల, ఆవుల పోతురాజు, పెద నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.







నడిగడ్డ చెరువు నుంచి కొప్పుకొండ మేజర్ కాలువకు నీటిని తోడేందుకు ఉపయోగిస్తున్న మోటార్లు, నీటిని తరలించేందుకు వేసిన పైపులు

నీటికోసం రైతుల ఇక్కట్లు

- నీటి సరఫరాపై అధికారుల నిర్లక్ష్యం
- రైతుల కష్టాలను పట్టించుకోని పాలకులు
- సాగర్‌కాలువకు చెరువునీటిని తరలించి పంటల సాగు
- పంటలను కాపాడుకునేందుకు మూడు కిలోమీటర్ల నుంచి నీటి తరలింపు

వినుకొండ టౌన్, డిసెంబరు 31: రైతులు పండించుకున్న పంటలకు ఈ సంవత్సరం వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో రైతులు నీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధానజలశయాల్లో నీరు లేక కాలువలు నీరు పారే పరిస్థితి కనపడటం లేదు. గత సంవత్సరంలో పెట్టిన పెట్టుబడులు కూడా రాకపోవడంతో కొన్ని గ్రామాల్లోని రైతులు క్రాప్ హాలీడే ప్రకటించారు. ఈ సంవత్సరం వాణిజ్య పంటలపై ఆధారపడిన రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర వస్తుందని నీటి సౌకర్యమైన ప్రాంతాల్లో నారులు పోశారు. తీరా పంట పొలాల్లో నారు నాటే సమయానికి వర్షాలు మొహం చాటేడంతో ఆశించిన మేరకు వర్షాలు పడకపోవడంతో రైతులు నీటి కోసం వెతుకోవాల్సిన పరిస్థితి నెలకొని ఉంది. వాణిజ్య పంటల్లో ఒకటైనా మిర్చి, పొగాకు ధరలు పలకడంతో పంటలు పండించేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. మండలంలోని నడిగడ్డ, కొప్పుకొండ, నీలగంగవరం తదితర ప్రాంతాలతో పాటు మరికొన్ని గ్రామాల్లోని ప్రజలు చెరువునీటిపై ఆధారపడి పంటలు సాగు చేస్తున్నారు. రైతులకు పంటలకు అవసరమైన నీటిని అందించడంలో అధికారులు పూర్తిగా విఫలం కావడంతో మండలంలోని నడిగడ్డ గ్రామానికి చెందిన రైతులు నీటి కోసం భగీరథ యత్నం ఆరంభించారు. ఊరి సమీపంలోని చెరువు నుంచి మూడు కిలోమీటర్ల పొడవున ఉన్న కొప్పుకొండ కాలువకు ఏకంగా పైపుల ద్వారా నీటిని తరలిస్తున్నారు. ఎకరాకు రూ.లక్ష నుంచి రూ.1.50లక్షలు నీటి కోసం వెచ్చించి ఎండిపోతున్న పంట పొలాలను కాపాడుకోవాల్సిన పరిస్థితి ఇక్కడ నెలకొని ఉంది. సుమారు 500 నుంచి 800 ఎకరాల మేరకు రైతులు తమ పంట పొలాలను చెరువునీటిని ఆయిల్ ఇంజన్లతో తరలించి పంటలు పండిస్తున్నారు. అధికారులు రైతులకు అవసరమైన నీటిని సరఫరా చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని ఆ ప్రాంతంలోని రైతులు వాపోతున్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పాలనలో అన్నీవ్యవస్థలు కుంటుపడ్డాయని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా రైతులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని పంటలకు అవసరమైన నీటి సరఫరాపై అధికారులు దృష్టిసారించాలని రైతులు కోరుతున్నారు.



కాలువ కింద చెరువునీటితో రైతులు సాగు చేస్తున్నమిర్చి పంటలు, సాగర్‌కాలువలో ప్రవహిస్తున్న నడిగడ్డ చెరువు నీరు

వీడని మంచు తెరలు



7.45గంటలప్పుడు మంచుతో కప్పబడిన వినుకొండ రైల్వేస్టేషన్

వినుకొండ టౌన్, డిసెంబరు 31: పట్టణంలో మంచుతీవ్రత అధికంగా ఉండటంతో ప్రయాణికులు ఆదివారం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తెల్లవారుజామున 5 గంటల నుంచి 6 గంటల మధ్య వచ్చే తిరుపతి రైలుకు ప్రయాణికులు వినుకొండ నుంచి గుంటూరు వెళ్లాల్సి ఉంది. రోడ్లన్నీ మంచుతో కప్పబడి ఉండటంతో ప్రయాణికులకు ఎదురువచ్చే వాహనాలు కనిపించక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉదయం 7.45 గంటలు అయినప్పటికీ వినుకొండ రైల్వేస్టేషన్ మంచుతో కప్పబడి కనపించని దృశ్యం.

ఎంఎల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దుప్పట్లు, పండ్లు పంపిణీ

వినుకొండ టౌన్, డిసెంబరు 31: పట్టణంలోని ఏనుగుపాలెం గేటు వద్ద నిరాశ్రయులకు, వృద్ధులకు ఎంఎల్ ఫౌండేషన్ అధ్యక్షుడు గుద్దేటి చందు ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు పాల్గొని పండ్లు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫౌండేషన్ సేవలను అభినందించారు.

మాజీ సర్పంచ్‌కు అరవిందబాబు నివాళి

రొంపిచర్ల, డిసెంబరు 31: మండలంలోని మాచవరం మాజీ సర్పంచ్ పోతిరెడ్డి కృష్ణారెడ్డి మృతిచెందారు. ఆదివారం టీడీపీ ఇన్‌చార్జ్ డాక్టర్ అరవిందబాబు ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. గ్రామంలో టీడీపీ అభివృద్ధికి కృష్ణారెడ్డి చేసిన సేవలను కొనియాడారు. ఆయన మృతికి టీడీపీకి తీరని లోటు అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



కృష్ణారెడ్డి మృత దేహం వద్ద నివాళులర్పిస్తున్న అరవిందబాబు